మీ గళం.. మా కలం...!
# నమస్తే హైదరాబాద్
www.namasthehyderabad.in
తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను
నిత్యనూతనంగా వెలువడుతూ విశేష ప్రజాధరణ పొందుతున్న నమస్తే హైదరాబాద్ తెలుగు దినపత్రికకు తెలంగాణ రాష్ట్రం లోని అన్ని జిల్లా, మండల కేంద్రాలలో విలేకరులు కావలెను
సీనియర్‌లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం
Ph: 9912580066

రంగా రెడ్డి సంపుటి : 13 సంచిక :248 ఎడిటర్: గొడిశాల సోమయ్యగురువారం 06-02-2025 పేజీలు :4 వెల : 2రూ

## వర్గీకరణలో దేశంలో మేమే ముందు



హైదరాబాద్, ఫిబ్రవరి 4 ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేసే విషయంలో తమ ప్రభుత్వం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తీర్పు వచ్చినరోజే.. ఎస్సీ వర్గీకరణ అమలుకు తాము కట్టుబడి ఉన్నామని ప్రకటించామన్నారు. ఆ దిశగా డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ వేయడం, ఆ నివేదికను ఆమోదించడం ద్వారా ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై మంగళవారం అసెంబ్లీలో ప్రభుత్వం తరఫున సీఎం ప్రకటన చేశారు. షమీమ్ అక్తర్ కమిషన్ నాలుగు సిఫారసులు చేయగా.. అందులో మూడింటిని ఆమోదించామన్నారు. ఎస్సీల్లోని 59 కులాలను మూడు గ్రూపులుగా విభజించాలన్న సిఫారసునూ ఆమోదించినట్లు తెలిపారు. ఉద్యోగ ఖాళీలను క్రమబద్ధంగా, సమానంగా భర్తీ చేసేందుకు ప్రిఫరెన్షియల్ మోడల్, రోస్టర్ పాయింట్లకు సంబంధించి కమిషన్ ఇచ్చిన సిఫారసులకు అంగీకారం తెలిపామన్నారు. క్రీమీ లేయర్ ప్రవేశపెట్టాలన్న సిఫారసును మాత్రం తిరస్కరించామన్నారు. ఎస్సీ వర్గీకరణకు కమిషన్ ఇచ్చిన సూచనలకు అనుగుణంగా తదుపరి చర్యలు చేపట్టేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు.

ఆత్మసంతృప్తి కలిగించిన రోజు..

తన 20 ఏళ్ల రాజకీయ జీవితంలో ఆత్మసంతృప్తినిచ్చిన రోజు ఇది అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రాజకీయ జీవితానికి పరిపూర్ణత వచ్చిందన్నారు. ఎవరికీ రాని అవకాశం తనకు వచ్చిందని, తన విషయంలో ఒక పేరా రాయాల్సి వస్తే.. 4 ఫిబ్రవరి 2025 గురించి రాయాలని వ్యాఖ్యానించారు. ఆనాడు ఎస్సీ ఉపకులాల వర్గీకరణకు తాను వాయిదా తీర్మానం ఇస్తే.. సభ నుంచి బయటకు పంపించారని, ఇప్పుడు సభా నాయకుడిగా వర్గీకరణ అమలుకు సభలో నిర్ణయం తీసుకుంటున్నానని చెప్పారు. ఇది అంబేద్కర్ 2లో

## అండర్-19 మహిళా క్రికెటర్ గొంగడి త్రిషకు రూ కోటి నజరానా..



తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన యువ క్రికెటర్ గొంగడి త్రిష ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. అండర్-19 మహిళల వరల్డ్ కప్‌లో తన అద్భుత ప్రదర్శనతో దేశాన్ని గర్వపడేలా చేసిన త్రిషను సీఎం తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు.జూబ్లీహిల్స్‌లోని సీఎం క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో 2లో

## బీఆర్ఎస్ సంచలన నిర్ణయం.. ఆ ఎన్నికలకు బీఆర్ఎస్ దూరం



కరీంనగర్ జిల్లా: రాష్ట్రంలో మళ్లీ ఎన్నికల నగారా మోగింది. మూడు ఎమ్మెల్సీల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో భారతీయ రాష్ట్ర సమితి సంచలన నిర్ణయం తీసుకుంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి బీఆర్ఎస్ దూరంగా ఉండాలని నిర్ణయించినట్లు సమాచారం. నామినేషన్ల గడువు దగ్గర పడుతున్నా అభ్యర్థిని గులాబీ బాస్ ఇంతవరకు ప్రకటించలేదు. పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నా.. నేతలకు కేసీఆర్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. పార్టీలో చేరి పోటీ చేద్దామనుకున్న ప్రసన్న హరికృష్ణకు కేసీఆర్ అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. కాగా మాజీ మేయర్ రవీందర్‌కు మద్దతుగా నిలవాలని ఎమ్మెల్సీ కవిత సూచించారు. గతంలో కూడా ఈ స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థిని నెలబెట్టలేదు. కొందరు ఆశవహులు మాత్రం తమకు అవకాశం ఇవ్వాలని నాయకత్వాన్ని కోరినట్లు తెలియవచ్చింది.

## రాష్ట్రపతి ముర్ముపై సోనియా గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు..



బడ్జెట్ సమావేశాలు వాడీవేడిగా కొనసాగుతున్నాయి.. అధికార, విపక్షపార్టీల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి.. అయితే.. పార్లమెంట్ బడ్జెట్ 2025 సమావేశాల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం తర్వాత కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి.. ఈ వ్యాఖ్యలపై జాతీయ రాజకీయాలు మళ్లీ వేడెక్కాయి. బీజేపీ సహా ఎన్డీఏ పార్టీలు సోనియా గాంధీని తీవ్రంగా విమర్శిస్తున్నాయి. సోనియా గాంధీ 2లో

## తెలంగాణ టెట్ ఫలితాలు వచ్చేశాయ్..

హైదరాబాద్, ఫిబ్రవరి 5: తెలంగాణ టెట్ ఫలితాలను విద్యాశాఖ కార్యదర్శి యోగిత రాణా బుధవారం విడుదల చేశారు. తొలుత టెట్ ఫలితాలను విడుదల చేసేందుకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అడ్డొస్తుందని భావించినప్పటికీ.. ఇప్పటికే ఎగ్జామ్ పూర్తయినందున ఎలాంటి అడ్డంకులు లేవని భావించిన విద్యాశాఖ బుధవారం సాయంత్రం ఫలితాలు విడుదల చేసింది. జనవరి 2 నుంచి జనవరి 20 వరకు 20 సెషన్స్ లో జరిగిన టెట్ పరీక్షల్లో 1,35,82 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 42,384 మంది అభ్యర్థులు క్వాలిఫై అయ్యారు.

టెట్ ఫలితాల్లో 31.21 శాతం ఉత్తీర్ణత నమోదు అయినట్లు ఫలితాల ప్రకటనలో వెల్లడించారు. పేపర్ -1 లో 69, 476 మంది పరీక్ష రాస్తే 41 ,327 మంది అభ్యర్థులు క్వాలిఫై అయ్యారు. పేపర్ 2 లో మ్యాథ్స్ అండ్ సైన్స్ లో 69,390 మంది పరీక్ష రాస్తే 23,755 మంది ఉత్తీర్ణత సాధించారు. సోషల్ స్టడీస్ పేపర్ లో 66,412 మంది ఎగ్జామ్ రాస్తే 18,629 మంది ఉత్తీర్ణత సాధించారు. పేపర్ 1 అండ్ 2 లో కలిపి 1,35,802 మంది పరీక్షలు రాస్తే 42,384 మంది ఉత్తీర్ణత సాధించారు. టెట్ ఫలితాలను స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్ సైట్ లోను అందుబాటులో ఉంచారు.కాగా ఏడాదికి రెండు సార్లు టెట్ నిర్వహిస్తామని హామీ ఇచ్చిన రేవంత్ సర్కార్ ఆ మేరకు గతేడాది రెండు సార్లు టెట్ నిర్వహించింది. 2024 డిసెంబర్ సెషన్ కు సంబంధించిన పరీక్షలు నిర్వహించగా.. దీని ఫలితాలు ఈ రోజు వెల్లడించింది.



## కులగణనపై ఎంపీ రాహుల్ గాంధీకి కేటీఆర్ సూటి ప్రశ్న..



హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన సర్వేలో బీసీ జనాభాను తగ్గించి వారిని దారుణంగా వెన్నుపోటు పొడిచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తప్పులతడకగా లెక్కలు వేసి సర్వే పూర్తయిందని చెప్పడం ముమ్మాటికీ వెనకబడిన వర్గాలను మోసం చేయడమేనని ఆయన మండిపడ్డారు. ఈ మేరకు కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి ఎమ్మెల్యే కేటీఆర్ లేఖ రాశారు. తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ కులగణన సర్వే పూర్తి చేసిందని లోక్ సభలో మీరు (రాహుల్ గాంధీ) చెప్పడం పార్లమెంట్‌ను తప్పుదోవ పట్టించడమేనని కేటీఆర్ మండిపడ్డారు. లక్షలాది మంది వివరాలు సేకరించకుండా సర్వే ఎలా పూర్తవుతుందని రాహుల్‌ని కేటీఆర్ ప్రశ్నించారు.

## ఢిల్లీలో ముగిసిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్..

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది.. సాయంత్రం 6గంటలు దాటినా.. క్యూలైన్లలో ఉన్న వారిని ఓటు వేసేందుకు అధికారులు అనుమతించారు.. కాగా.. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో సీలంపూర్, జంగ్‌పూర్, అకోలా నియోజకవర్గాలు మినహా మిగతా ప్రాంతాల్లో ప్రశాంతంగా ముగిసింది. ఓటర్లను ఓటు వేయకుండా బీజేపీ కార్యకర్తలు అడ్డుకున్నారని ఆప్ నేతలు ఆరోపించారు. సీలంపూర్‌లో అయితే ఆప్ కార్యకర్తలు బురా? ధరించి దొంగ ఓట్లు వేస్తున్నారని బీజేపీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. సాయంత్రం 5 గంటల వరకు 58 శాతం పోలింగ్ నమోదయ్యింది. పలు నియోజకవర్గాల్లో ఆప్, బీజేపీ అభ్యర్థుల మధ్య టఫ్ ఫైట్ ఉంది. గెలుపుపై అటు బీజేపీ, ఇటు ఆప్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ కూడా కొన్ని నియోజకవర్గాల్లో గట్టి పోటీ ఇస్తున్నట్లు పేర్కొంటున్నారు.ఢిల్లీలో అంచనాలను మించి పోలింగ్ శాతం నమోదవడంతో.. అంచనాల్లో పార్టీలు




## ఎండ మంటలు

హైదరాబాద్, ఫిబ్రవరి 5: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఎండలు మండిపోతున్నాయి. ఇప్పటికీ పలు జిల్లాల్లో రాత్రి వేళల్లో చలి విజృంభిస్తున్నా పగటి పూట ఎండలు హడలెత్తిస్తున్నాయి. ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. రాబోయే వారం రోజులు ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ ప్రాంతీయ వాతావరణ కేంద్రం బుధవారం ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు కనీసం 2-3 డిగ్రీల సెల్సియస్ మేర పెరుగుతాయని తెలిపింది. హైదరాబాద్‌లో రానున్న వారం రోజుల్లో కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 19-34 డిగ్రీల సెల్సియ్‌సగా ఉండవచ్చని ప్రాంతీయ వాతావరణ కేంద్రం ఇన్‌చార్జి కే నాగరత్న పేర్కొన్నారు. మరోపక్క, ఎండల తీవ్రతకు తోడు రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ కూడా పెరిగిపోతోంది. ఏసీలు, ఫ్యాన్లు, కూలర్ల వాడకం మొదలవ్వడంతో విద్యుత్ వినియోగం అమాంతం పెరిగిపోయింది. రాష్ట్ర విద్యుత్ డిమాండ్ మంగళవారం రికార్డు స్థాయిలో 15,582 మెగావాట్లుగా నమోదయింది. గతేడాది ఇదే రోజున విద్యుత్ డిమాండ్ 13,276 మెగావాట్లుగా ఉండడం గమనార్హం.

## కులగణనపై ప్రజల్ని తప్పుదోవ పట్టించొద్దు..



2లో

## అండర్-19 మహిళా క్రికెటర్ గొంగడి త్రిషకు రూ కోటి నజరానా..

ముఖ్యమంత్రి త్రిష ప్రతిభను కొనియాడుతూ కోటి రూపాయల నజరానా ప్రకటించారు. "నీ ప్రతిభ తెలంగాణ గర్వించదగినది. భవిష్యత్తులో భారత జట్టును మరింతగా గెలిపించాలి" అంటూ ఆమెకు ప్రోత్సాహం అందించారు. తెలంగాణ నుంచి అంతర్జాతీయ స్థాయిలో మహిళా క్రికెటర్లు ఎదగడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు.అండర్–19 మహిళల వరల్డ్ కప్ టీమ్‌లో సభ్యురాలిగా నిలిచిన మరో తెలంగాణ క్రీడాకారిణి ధృతి కేసరి ను కూడా సీఎం అభినందించారు. ఆమె ప్రతిభను గుర్తిస్తూ 10 లక్షల రూపాయల నగదు బహుమతి ప్రకటించారు.

కోచ్, ట్రైనర్లకు కూడా ప్రోత్సాహం

కేవలం క్రీడాకారులకే కాకుండా, వారిని తీర్చిదిద్దిన కోచ్‌లు, ట్రైనర్లకు కూడా గుర్తింపు ఇవ్వడం ప్రభుత్వం యొక్క లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అండర్–19 మహిళల టీమ్ హెడ్ కోచ్ నౌషీన్, ట్రైనర్ షాలినిలకు చెరో 10 లక్షల నగదు ప్రోత్సాహకం ప్రకటించారు.

మహిళా క్రీడాకారుల ఎదుగుదలకు తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సీఎం స్పష్టం చేశారు. "మహిళా క్రికెట్‌ను మరింత అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుంది. ఆటగాళ్లకు ఉత్తమ శిక్షణ, ప్రోత్సాహకాలు అందజేస్తుంది" అని తెలిపారు.

# ఢిల్లీలో ముగిసిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్..

తలమునకలవుతున్నాయి. 2020 ఎన్నికల్లో సాయంత్రం 5 గంటల వరకు 44.52 శాతం పోలింగ్ నమోదైంది.. 2025లో సాయంత్రం 5 గంటల వరకు 58 శాతం పోలింగ్%ా% గత ఎన్నికలతో పోలిస్తే 13 శాతం పోలింగ్ పెరిగింది.. పెరిగింది అనుకూల ఓటా..? ప్రతికూల ఓటా..? అంటూ ఆమ్ ఆద్మీ పార్టీ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అంచనావేస్తున్నాయి.. శనివారం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ జరుగుతుంది. ఇప్పటివరకు ఢిల్లీలో అత్యధికంగా ముస్తఫాబాద్‌లో 66.7 శాతం పోలింగ్ నమోదయ్యింది. కరోల్‌బాగ్‌లో అత్యల్పంగా 47.4 శాతం పోలింగ్ నమోదయ్యింది. ఢిల్లీలో కోటి 56 మంది ఓటర్లు ఉన్నారు. 700 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని ఓటర్లు తేల్చబోతున్నారు.

# కులగణనపై ప్రజల్ని తప్పుదోవ పట్టించొద్దు..

హైదరాబాద్, ఫిబ్రవరి 5 : కులగణనపై ప్రజల్ని తప్పుదోవ పట్టించొద్దని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రతిపక్షాలను కోరారు. ఇది రాజకీయాలు చేసేందుకు సరైన సమయం కాదంటూ ప్రతిపక్షాలకు హితవు పలికారు. 'కులగణన సర్వేను అత్యంత పకడ్బందీగా నిర్వహించాం. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ ఇంటింటికెళ్లి వివరాలు సేకరించాం. అయినా.. కొందరు పనిగట్టుకుని నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వేను అశాస్త్రీయంగా నిర్వహించింది. పారదర్శకతకు పాతరేసి తప్పుల తడకగా నివేదికను తయారు చేసింది. ఆ వివరాలను ప్రజల ముందు పెట్టలేదు.

## సైకిల్ పై తిరుగుతూ సైబర్ క్రైమ్ లపై అవగాహన నిర్వహిస్తున్న ఘట్కేసర్ పోలీసులు



**ఘట్కేసర్ ఫిబ్రవరి 5 (నమస్తే హైదరాబాద్)**

మేడ్చల్ జిల్లా, ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ సీఐ పరశురాం ఆదేశానుసారం ప్రతిరోజు సైకిల్ పై వెళ్లి సైబర్ క్రైమ్ పై అవగాహన కార్యక్రమాలు చేయడం జరుగుతుంది. పరశురాం మాట్లాడుతూ సైబర్ నేరాలు పెరుగుతున్నందున ఘట్కేసర్ మున్సిపాలిటీ ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు ప్రతిరోజు నిర్వహించడం జరుగుతుందని, అందరికీ సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని అని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరా అంతరాయం

**ఘట్కేసర్ ఫిబ్రవరి 5(నమస్తే హైదరాబాద్)**

మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలో గురువారం (06.02.25) ఘట్కేసర్ ఏఈ యశ్వంత్ తెలిపిన ప్రకారం మధ్యాహ్నం1030 నుండి 1100 వరకు ఘట్కేసర్ విద్యుత్ అంతరాయ ప్రాంతాలు, సింగరేణి కాలనీ, పటేల్ నగర్, హెచ్పిసిఎల్. విద్యుత్ అంతరాయం కి చింతిస్తూ, ప్రజలు సహకరించగలరు.

# వర్గీకరణలో దేశంలో మేమే ముందు

అందించిన రాజ్యాంగం వల్లే సాధ్యమైందన్నారు. అంతకుముందు అసెంబ్లీ లాబీలో ముఖ్యమంత్రి మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ.. కులగణన, ఎస్సీ వర్గీకరణకు తెలంగాణ నుంచి రోడ్‌మ్యాప్ ఇస్తున్నామని, ఇక్కడి కులగణన ఇతర రాష్ట్రాలకు రిఫరెన్సుగా మారుతుందని అన్నారు. తమ నిర్ణయంతో ప్రధానిపైనా ఒత్తిడి పెరుగుతుందన్నారు. ఇక పార్టీ మారిన ఎమ్మెల్యేలకు అసెంబ్లీ కార్యదర్శి నోటీసులు ఇవ్వడం ప్రొసీజర్‌లో భాగమని ఒక ప్రశ్నకు సమాధానంగా సీఎం చెప్పారు. ఉప ఎన్నికలు ఎందుకు వస్తాయని ప్రశ్నించారు. అసెంబ్లీకి రానివారు అసెంబ్లీ టైం గురించి మాట్లాడుతున్నారంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌నుద్దేశించి విమర్శించారు. మరోవైపు తమ ప్రభుత్వం చేపట్టి.. పూర్తిచేసిన కులగణన రేపటి తరానికి ఆదర్శమని 'ఎక్స్' ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# రాష్ట్రపతి ముర్ముపై సోనియా గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు..

చేసిన వ్యాఖ్యలపై 21 మంది బిజెపి ఎంపీలు పార్లమెంటులో ప్రివిలేజ్ నోటీసు ఇచ్చారు. ఈ సంఘటన తర్వాత, రాష్ట్రపతి గిరిజన వర్గానికి చెందినవారు కాబట్టి ఆమెను కాంగ్రెస్ సహించలేకపోతోందన్న ఆరోపణలు వస్తున్నాయి. దేశంలోని అత్యున్నత పదవిలో ఒక సాధారణ, పేదచ గిరిజన మహిళను సహించడంలో, గౌరవించడంలో కాంగ్రెస్ ఉన్నత వర్గాలకు అసౌకర్యంగా ఉందని బిజెపి, ఇతర ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు విమర్శిస్తున్నాయి.. అయితే, కాంగ్రెస్ దీనిని బిజెపి కుట్రగా అభివర్ణించింది.వాస్తవానికి బడ్జెట్ సమావేశాలు.. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ ప్రసంగంతో ప్రారంభమయ్యాయి.. రాష్ట్రపతి ముర్మ ప్రసంగంపై సోనియా గాంధీ మీడియా వేదికగా స్పందిస్తూ.." రాష్ట్రపతి చివరి నాటికి చాలా అలసిపోయారు.. ఆమె మాట్లాడలేకపోయారు.. పూర్ ఉమెన్" అంటూ పేర్కొన్నార. సోనియా గాంధీ చేసిన ఈ వ్యాఖ్యల తర్వాత గందరగోళం చెలరేగింది.

అవమానకరమైన వ్యాఖ్యలుగా అభివర్ణించిన రాష్ట్రపతి భవన్‌సోనియా గాంధీ ప్రకటన తర్వాత, రాష్ట్రపతి భవన్ ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది.. సోనియా గాంధీ ఆ వ్యాఖ్యలను అవమానకరమైనదిగా, రాష్ట్రపతి పదవి గౌరవానికి హాని కలిగించేదిగా అభివర్ణించింది. సత్యం కంటే గొప్పది ఏదీ లేదని రాష్ట్రపతి భవన్ పేర్కొంది.. రాష్ట్రపతి ఏ సమయంలోనూ అలసిపోయినట్లు కనిపించలేదు. నిజానికి, ఆమె తన ప్రసంగంలో చేసినట్లుగా, అణగారిన వర్గాలు, మహిళలు, రైతుల కోసం మాట్లాడటంలో ఎప్పుడూ అలసిపోమని ఆమె నమ్ముతారు.. ఈ నాయకులకు హిందీ వంటి భారతీయ భాషల జాతీయాలు, ఉపన్యాసాలు తెలియకపోవచ్చు.. అందువల్ల వారు తప్పుడు అభిప్రాయాన్ని ఏర్పరచుకున్నారని రాష్ట్రపతి కార్యాలయం విశ్వసిస్తోంది. ఏదేమైనా, ఇలాంటి వ్యాఖ్యలు చెడు అభిరుచి గలవి.. దురదృష్టకరం, పూర్తిగా ఆమోదయోగ్యం కానివి.. అంటూ పేర్కొంది.సభలో మాట్లాడిన ప్రధాని మోదీ.. కాంగ్రెస్ రాజకుటుంబం రాష్ట్రపతిని అవమానించేలా వ్యవహరించిందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. గిరిజనుల గురించి కాంగ్రెస్ ఏమనుకుంటుందో మరోసారి చూపించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును పూర్ ఉమెన్ (పేద మహిళ) అని పిలిచి సోనియా గాంధీ గిరిజనులను అవమానించారు.. అంటూ మోదీ పేర్కొన్నారు.గతంలో కూడా నోరు జారిన కాంగ్రెస్ నాయకుడు అధీర్ రంజన్ చౌదరి..జూలై 2024లో.. లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును రాష్ట్రపత్ని అంటూ సంబోధించారు. ఆమెను 'రాష్ట్రపత్ని' అని సంబోధించినప్పుడు సభ లోపల, వెలుపల తీవ్ర గందరగోళం చెలరేగింది. ఆ సమయంలో కూడా, ముర్మ గిరిజన సమాజం నుంచి వచ్చారని%ా% అందుకే కాంగ్రెస్ ఆమెను ఉద్దేశపూర్వకంగా అవమానిస్తోందని బిజెపి ఆరోపించింది. అధిర్ రంజన్ చౌదరిపై చర్యలు తీసుకోవాలని బిజెపి డిమాండ్ చేసింది.. అతని ప్రకటన గిరిజన సమాజంలోని అత్యున్నత స్థాయి మహిళను అవమానించిందని పేర్కొంది. అయితే, చౌదరి తన పేలవమైన హిందీని ఉటంకిస్తూ క్షమాపణలు చెప్పారు.. కానీ అతని నేపథ్యం కారణంగా కాంగ్రెస్ ఇలా తరచూ చేస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి..

# సమాధుల స్థలాన్ని హైడ్రా అధికారులు కాపాడేనా?





**మేడిపల్లి ,ఫిబ్రవరి 05 (నమస్తే హైదరాబాద్):** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పర్వతాపూర్ సాలార్జంగ్ కంచ సర్వే నెంబరు 1, 10 ,11 లోని ప్రభుత్వ అసైన్డ్ సీలింగ్ భూమీలో క్రిస్టియన్, ముస్లిం మైనారిటీ సామాజిక వర్గానికి చెందిన సమాధులు ఉండేవి. గతంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సూచిక బోర్డులో ఉండేవి వాటిని సైతం లెక్కచేయకుండా ఆ భూమిపై కన్నేసిన భూకబ్జాదారులు రెవెన్యూ అధికారుల అండదండలతో కబ్జా చేసి అమాయక ప్రజలకు అంటగట్టి కోట్ల రూపాయల రియల్ వ్యాపారం చేసుకున్నారని ముస్లిం మైనారిటీ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎండి మజార్ ఆరోపించారు. వారికి రెవెన్యూ అధికారులు సైతం వత్తాసు పలుకుతున్నారని మజార్ తెలిపారు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు గతంలో మల్కాజ్గిరి పార్లమెంటు ఎంపీగా ఉన్నప్పుడు ఈ విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని దానిపై ఉన్నత అధికారులతో చర్చించి ఆ స్థలాన్ని కాపాడుతానని చెప్పారని తెలిపారు. ప్రభుత్వ భూముల్ని చెరువుల్ని ,పార్కులను కాపాడాలని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన హైడ్రాకి ఈ విషయాన్ని మజార్ లిఖితపూర్వక దరఖాస్తు చేశానని తెలిపారు హైడ్రా కమీషనర్ రంగనాథ్ గారు డిసెంబర్ 2న అధికారులను పంపించి స్థల పరిశీలన చేశారు ఆ రోజు అధికారులు రికార్డులు పరిశీలించి చర్యలు చేపడతామన్నారు కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు దీని వెనుక రెవెన్యూ అధికారుల అలసత్వం ఉందని అర్థమవుతుంది బుధవారం హైడ్రా ఆఫీస్ డిప్యూటీ కలెక్టర్ గారిని కలవగా మాకు ఎమ్మార్వో నుండి రిపోర్ట్ రాలేదని చెప్పారని అన్నారు ఎమ్మార్వో గారు రిపోర్ట్ ఎందుకు పంపలేకపోతున్నారని దీని వెనుక ఉన్న మర్మం ఏమిటి అని ఎండి మజార్ తెలిపారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఆ భూమిలో సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ఆ స్థలాన్ని కాపాడే వరకు మా ఈ పోరాటం ఆగదని అన్నారు ముందు ముందు క్రిస్టియన్, ముస్లిం మైనారిటీ మత పెద్దల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మా కార్యచరణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండి మజార్ , ఎండి కరీం,పర్వతాపూర్ క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ ప్రెసిడెంట్ బర్రె చార్లెస్, బి నాగరాజు, గుర్రం దానం ఆంటోనీ శ్రీనివాస్ పాల్గొన్నారు

# పేకాట ఆడుతున్న ఇంటిపై దాడి చేసిన పోలీసులు

**ఘట్కేసర్ ఫిబ్రవరి 5 (నమస్తే హైదరాబాద్)**

మేడ్చల్ జిల్లా, ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని ఈడబ్ల్యూఎస్ కాలనీలో పేకాట ఆడుతున్నారని సమాచారంతో, ఈడబ్ల్యూఎస్ కాలనీలో ఉన్న ఇంటిపై రైడింగ్ చేసి పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులు అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 169000 రూపాయలు, మొబైల్ ఫోన్స్, ప్లేయింగ్ కార్డ్స్ ను సీజ్ చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు.




## కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తుంది: వి.జగదీశ్వర్ గౌడ్



**నమస్తే హైదరాబాద్,శేరిలింగంపల్లి :** దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించినందుకు డప్పులు కొట్టి కృతజ్ఞతలు తెలిపారు శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్.సామాజిక,ఆర్థిక,విద్యా,ఉపాధి,రాజకీయ,కుల గణన (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే 2024) సర్వేకు జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ నివేదికలోని కీలకమైన మూడు అంశాలకు మంత్రిమండలిలో ఆమోదించి,శాసనసభలో ప్రకటన చేసిన నేపథ్యంలో ఈరోజు శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ గారి ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం నాయకులతో కలిసి డాక్టర్.బాబా సాహెబ్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గారి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా బీసీ,ఎస్సీ,ఓసి,ఎస్టీ,మైనారిటీ సామాజిక వర్గానికి చెందిన నాయకులు పెద్దఎత్తున పాల్గొన్ని సీఎం ఏ.రేవంత్ రెడ్డి మంత్రివర్గానికి శుభాకాంక్షలు,అభినందనలు,ధన్యవాదాలు తెలియజేశారు. రాహుల్ గాంధీ ,సోనియా గాంధీ ,మల్లికార్జున్ ఖర్గే ,కేసి వేణుగోపాల్ ,దిపాదాస్ మున్షీ ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలిపారు,ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం నాయకులు రాములు గౌడ్,బలింగ్ యాదగిరి గౌడ్,వీరేందర్ గౌడ్,కనకమామిడి నరందేర్ గౌడ్,శేఖర్ ముదిరాజ్,మన్నెపల్లి సాంబశివరావు,ఉరిటీ వెంకట్ రావు,ప్రభాకర్ రెడ్డి,కట్ల శేఖర్ రెడ్డి,వల్లపు సురేందర్,రాజేందర్ గౌడ్,పట్వారీ శశిధర్,గఫర్,విజయభాస్కర్ రెడ్డి,డివిజన్ అధ్యక్షులు బాప్పక యాదగిరి, శ్యామ్,కృష్ణ,శ్రీనివాస్ గౌడ్,జహంగీర్, యాదయ్య,రవి కుమార్,రామచందర్, యాలమంచి ఉదయ్ కిరణ్,సత్తి రెడ్డి,పద్మ రావు,నాయిూమ్ రాజేష్, యాదగిరి వెంకటేష్, హనుమంతు,జవీద్,శ్రీనివాస్ రెడ్డి,లక్ష్మణ్, భరత్,బాలరాజు ముదిరాజ్,సత్యనారాయణ యాదవ్,కృష్ణ యాదవ్,అస్లాం,శివ గౌడ్,జగదీష్,నర్సింహ రాజు, జంగిర్, సురేష్ గౌడ్,కార్తిక్ గౌడ్,ఖాజా,గోపాల్ నాయక్, చంద్రమౌళి,శేరిలింగంపల్లి యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నితిన్ గౌడ్,ఆదిత్య ముదిరాజ్,మధు,వెంకటేష్ ముదిరాజ్, మహిళలు సునీత రెడ్డి,కల్పన ఏకాంత్ గౌడ్,లక్ష్మి,శిరీష సతుర్,జయ, శివాని,శాంత,సావిత్రి,జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి కాంగ్రెస్ పార్టీల నుండి టిఆర్ఎస్ పార్టీలో కి చేరికలు

**నమస్తే హైదరాబాద్ తుంగతుర్తి ప్రతినిధి ఫిబ్రవరి 5:**



తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన బిజెపి నాయకులు మాజీ గ్రంథాలయ చైర్మన్ గోపగాని రమేష్ కాంగ్రెస్ బిజెపి పార్టీల నుంచి పెరుమళ్ళ రమేష్ కటకం నందన్ దురసోజు శివ షేక్ పాషా బొంకూరి రాంబాబు పోలేపల్లి కిరణ్ కాగు సతీష్ పులుగుజ్జ మహేష్ వారితోపాటు పలువురు నాయకులు బుధవారం మాజీ మంత్రివర్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ సమక్షంలో బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. బి ఆర్ ఎస్ పార్టీలో చేరిన వారి కిమాజీ మంత్రివర్యులు బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గుజ్జ యుగంధర్ రావు మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ సీతయ్య మాజీ ఎంపీపీ గుండ గాని కవిత రాములు గౌడ్ మాజీ ఎంపీటీసీ దుర్గయ్య గ్రామ శాఖ అధ్యక్షుడు గోపగాని శ్రీను నాయకులు తడకమల్ల రవి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఏబిసిడి వర్గీకరణ అసెంబ్లీ లో ప్రతిపాదించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## డిసిసిబి డైరెక్టర్ ,పిఎసిఎస్ చైర్మన్ గుడిపాటి సైదులు



**నమస్తే హైదరాబాద్ తుంగతుర్తి ప్రతినిధి ఫిబ్రవరి 5:**
ఇచ్చిన మాట ప్రకారం ఏబిసిడి వర్గీకరణ భారత దేశంలో మొట్టమొదటిసారిగా తెలంగాణ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కిందని డిసిసిబి డైరెక్టర్ పిఎసిఎస్ చైర్మన్ గుడిపాటి సైదులు అన్నారు బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం కు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలు చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు మందకృష్ణ మాదిగ అహర్నిశలు చేసిన పోరాట ఫలితమే నేడు ఏబిసిడి వర్గీకరణకు నాంది పలికిందని అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగంలో పొందుపరిచిన రిజర్వేషన్లతో నేడు అభివృద్ధి పలాలు అనుభవిస్తున్నట్లు పేర్కొన్నారు. అసెంబ్లీలో వర్గీకరణ ప్రతిపాదించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్థానిక ఎమ్మెల్యే మందుల సామెల్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న మాదిగ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు తప్పట్ల శంకర్ దాసరి శ్రీను మాచర్ల అనిల్ క్యాస్ట్రో దాసరి శ్రీను ఎన్ఎస్ యుఐ తుంగతుర్తి అసెంబ్లీ అధ్యక్షులు కొండగడుపుల ప్రవీణ్, పోలేపాక అంజయ్య నాగరాజు మిట్ట గడుపుల అనూక్ ఆకారపు సైదులు ఆకారపు ఎల్లయ్య ఆకారపు ముత్తి లింగం గుండ గాని సుధాకర్ ఎన్ ఎస్ యు ఐ యువజన నాయకులు ప్రవీణ్, మిర్యాల నాగయ్య కలకోట్ల మల్లేష్ కొమ్ము జనార్ధన్ బొంకురి నాగయ్య వెంకన్న రాజు తదితరులు పాల్గొన్నారు.

# వాలీబాల్ లో సత్తా చాటిన కానిస్టేబుల్ సల్మా బేగం



**నాగారం, నమస్తే హైదరాబాద్: (ఫిబ్రవరి 5 )**
తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ కరీంనగర్ లో నిర్వహించిన మూడవ పోలీస్ స్పోర్ట్స్ మీట్లో నాగారం పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న సల్మా బేగం వాలీబాల్ క్రీడల్లో ఫిఫ్త్ జోన్ తరపున పాల్గొని రెండవ బహుమతి గెలుపొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను ఎస్ఐ ఎం.ఐలయ్య,పోలీస్ స్టేషన్ సిబ్బంది అభినందించారు.

## వెహికల్ చెకింగ్ లో పాల్గొన్న సీఐ పరశురాం



**ఘట్కేసర్ ఫిబ్రవరి 5 (నమస్తే హైదరాబాద్)**
మేడ్చల్ జిల్లా, ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలో వెహికల్ చెకింగ్ లో భాగంగా సిఐ పరశురాం పాల్గొన్నారు. పరశురాం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ మోటార్ వాహన పేపర్లు తమ వద్ద ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నరసింహ, పోలీస్ స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బిల్లులు సకాలంలో చెల్లించండి ఘట్కేసర్ మున్సిపల్ కమిషనర్




**ఘట్కేసర్ ఫిబ్రవరి 5 (నమస్తే హైదరాబాద్)**
మేడ్చల్ జిల్లా, ఘట్కేసర్ ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని, మరియు నూతనంగా వీలైనంత గ్రామాలకు ఘట్కేసర్ మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఇంటి పన్నులు, నల్ల బిల్లులు, ట్రేడ్ లైసెన్సులు సకాలంలో చెల్లించాలని, చెల్లించని ఎడల మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోబడుతాయని, సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని అన్నారు.

# కలవరపెడుతున్న GBS వైరస్.. పదేళ్ల బాలుడి మరణంతో 7కు చేరుకున్న మృతుల సంఖ్య

గులియన్ బారే సింద్రోమ్ ఇప్పుడు కలకలం రేపుతోంది. మహారాష్ట్రలోని పూణేలో %+దీూ% రోగుల సంఖ్య నిరంతరం పెరుగుతోంది. ఇక్కడ రోగుల సంఖ్య 158 కి చేరుకుంది. దేశవ్యాప్తంగా 166 కేసులు నమోదయ్యాయి. ఇటు తెలంగాణలోని హైదరాబాద్‌లోనూ ఒక కేసు వెలుగు చూసింది. ముఖ్యంగా పూణేలో కలుషిత నీటి కారణంగా రోగుల సంఖ్య పెరుగుతోందని భయపడుతున్నారు. ఎక్కువ కేసులు పూణే , దాని పరిసర ప్రాంతాల నుండి వచ్చాయి. తాజాగా మరో పదేళ్ల బాలుడి మృతితో మృతుల సంఖ్య 7కు చేరుకుంది.ఆరోగ్య శాఖ అధికారుల ప్రకారం, 31 మంది రోగులు పూణే మునిసిపల్ కార్పొరేషన్ నుండి, 83 మంది రోగులు సింహగడ్ రోడ్, కిర్కిట్వాడి, నందోషి అదే ప్రాంతంలోని కొన్ని గ్రామాలకు చెందినవారుగా గుర్తించారు. వీరితో పాటు, 18 మంది రోగులు పింప్రి చిన్చ్వాడ్ నుండి, 18 మంది రోగులు పూణే గ్రామీణ ప్రాంతానికి చెందినవారు. 8 మంది రోగులు ఇతర జిల్లాలకు చెందినవారు. ఇప్పటివరకు 38 మంది రోగులు డిశ్చార్జ్ అయ్యారు. అదే సమయంలో, 21 మంది రోగులు వెంటిలేటర్‌పై ఉన్నారు. మహారాష్ట్రలో గిలియన్-బారే సింద్రోమ్ (%+దీూ%) కారణంగా మరణించిన వారి సంఖ్య మంగళవారం (ఫిబ్రవరి 04) నాటికి 7 కి పెరిగింది. ఈ విషయంలో ఆరోగ్య శాఖ అధికారులు సమాచారం ఇచ్చారు. జనవరి 31న చెన్నైలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్‌లో చేరిన పదేళ్ల బాలుడు మంగళవారం మరణించాడు. తమిళనాడులో తొలి గుల్లెయిన్-బారే సింద్రోమ్ (%+దీూ%) బాధితుడిగా నిర్ధారించారు. గత నెల నుండి ఈ అరుదైన వ్యాధి ఇన్ఫెక్షన్ వల్ల సంభవించిన మరణాల సంఖ్య ఏడుకి చేరుకుంది. దేశవ్యాప్తంగా %+దీూ% మరణాలకు కారణం మహారాష్ట్ర పూణెలోని క్యాంపిలోబాక్టర్ జెజుని అనే బాక్టీరియం వ్యాప్తికి కారణమనిఆ ఆరోగ్య శాఖ అధికారులు నిర్ధారించారు.పూణే నగరంలోని వివిధ ప్రాంతాల నుండి అనేక నీటి నమూనాలను రసాయన, జీవ విశ్లేషణ కోసం ప్రజారోగ్య ప్రయోగశాలకు పంపారు. దర్యాప్తులో, ఎనిమిది నీటి వనరుల నుండి వచ్చిన నమూనాలు కలుషితమైనట్లు గుర్తించారు. పుణె నగరంలోని వివిధ ప్రాంతాల నుండి మొత్తం 160 నీటి నమూనాలను రసాయన, జీవ విశ్లేషణ కోసం ప్రయోగశాలకు పంపినట్లు ఒక అధికారి తెలిపారు. సింహగడ్ రోడ్ ప్రాంతంలోని కొన్ని ప్రైవేట్ బోర్‌వెల్‌ల నుండి తీసిన నమూనాలలో ఒకదానిలో ఎస్చెరిచియా కోలి లేదా ఇ-కోలి బ్యాక్టీరియా ఉన్నట్లు కనిపించిందని అధికారి తెలిపారు. నీటిలో ఈ-కోలి ఉండటం అనేది మలం లేదా జంతువుల వ్యర్థాల నుండి వచ్చే మురికి వ్యాప్తికి సూచన అని ఆయన అన్నారు. ఇది %+దీూ% ఇన్ఫెక్షన్‌కు కారణమవుతుందన్నారు.

# కారు బైక్ ఢీ ద్విచక్ర వాహనదారుడు మృతి



దేవరుప్పుల( నమస్తే హైదరాబాద్)కారు బైక్ ఢీ కొన్న ఘటనలో ద్విచక్రవహనంపై వెళ్తున్న అదనపు కలెక్టర్ డ్రైవర్ తాళ్ల పెల్లి ఉదయ్ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది,ఎస్ఐ సృజన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం సింగారాజుపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి ఉదయ్ నిర్మాలకు తన సొంత ద్విచక్ర వాహనంపై వెళుతుండగా నిర్మాల నుండి సింగారాజుపల్లి కి వస్తున్న మహేంద్ర వాహనం అతి వేగంగా ఢీకొనగా ఉదయ్ అక్కడికక్కడే మృతి చెందాడని, కారులో ఉన్న ఇద్దరికీ స్వల్ప గాయాలు కాగా వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

## లయన్స్ క్లబ్ ఆర్సి గుడిపూడి వెంకటేశ్వరరావు



నమస్తే హైదరాబాద్ తుంగతుర్తి ప్రతినిధి ఫిబ్రవరి 5: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులు లైన్స్ క్లబ్ అందిస్తున్న ఉచిత సదుపాయాలను సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివి మంచి మార్కులు సాధించినప్పుడే తగిన గుర్తింపు లభిస్తుందని లయన్స్ క్లబ్ ఆర్సి న్యాయవాది గుడిపూడి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో సూర్యాపేట లయన్స్ క్లబ్ సౌజన్యంతో ఉచిత స్టడీ మెటీరియల్ ను ,పెన్నులు, డిక్షనరీ, పరీక్షా ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువుతోపాటు, క్రీడా రంగాలలో రాణించినప్పుడే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని అన్నారు. త్వరలోనే జిమ్ సెంటర్ను స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలు చేతుల మీదుగా అందజేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి మెంబర్ నరసింహారెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్ కుమార్ ఫిజికల్ డైరెక్టర్ కొండగడుపుల యాకయ్య, కృష్ణవేణి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఈనెల 12న, చల్లూరు లో మినీ సమ్మక్క సారలమ్మ జాతర

నమస్తే హైదరాబాద్ : ప్రభాతవార్త రాజపేట మండలం చల్లురు గ్రామం లో సమ్మక్క సారక్క చిన్న పండగ తేదీని బుధవారం గ్రామస్తులు జాతర నిర్వాహకులు నిర్ణయించారు. గ్రామా పంచాయితీ వద్ద అన్నీ కులాల పెద్దమనుషులు, సమ్మక్క సారలమ్మ కమిటి ఆద్వర్యం లో మిని సమ్మక్క సారలమ్మ పండగ గురుంచి క్లుప్తముగా మాట్లాడి తేది నిర్ణయించారు. ఈనెల 12వ తేదీ బుదవారం పున్నమి రోజున చల్లురు శివాలయం నుండి సమ్మక్క సారలమ్మ గుట్టకు ఊరేగింపు గా బయలు దేరి అమ్మవార్లకు పసుపు కుంకుమ తీసుకొని అమ్మవారికి పూజ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. గ్రామ ప్రజలు భక్తులు అదిక సంఖ్యలో పాల్గొనాలని అమ్మ వార్లకు మొక్కులు చెల్లించుకొని మినీ సమ్మక్క సారలమ్మ పండగ విజయవంతం చేయాలని కోరారు.

# పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ తాడోపేడో.. జాతీయస్థాయి పోరుకు సిద్దం..

ఎమ్మెల్యేల ఫిరాయింపుపై చాలా సీరియస్‌గా ఉంది భారత రాష్ట్ర సమితి. ఎలాగైనా ఉప ఎన్నికలు తీసుకొచ్చి రాష్ట్ర రాజకీయాల్లో గులాబీ జెండాను రెపరెపలాడించాలని తపన పడుతుంది. పనిలో పనిగా పార్టీ నుంచి క్యాడర్‌ను ,లీడర్ షిప్‌ను కాపాడుకునేందుకు ఇదొక ఎత్తుగడగా వాడుకుంటుంది.ఇప్పటికే గులాబీ పార్టీ నుంచి పదిమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కొంతమంది బహిరంగంగా పార్టీ మారినట్లు ప్రకటించారు, మరి కొంతమంది మేము ఇంకా బీఆర్ఎస్‌లో ఉన్నామంటూ కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నారు. ఈ పార్టీ ఫిరాయింపులపై ఏడాది క్రితమే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది భారత రాష్ట్ర సమితి. హైకోర్టు ఎంతకీ తేల్చకపోవడంతో సుప్రీంకోర్టు తలుపు తట్టింది. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వేసిన పిటీషన్‌లో సుప్రీంకోర్టు స్పీకర్‌ను త్వరగా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అయినప్పటికీ స్పీకర్ నుంచి ఎలాంటి రెస్పాన్స్ లేకపోవడంతో అదే పిటీషన్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న కేటీఆర్ ఇంప్లీడ్ అయ్యారు. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను ఉటంకిస్తూ 90 రోజుల్లోగా పార్టీ ఫిరాయింపులపై ఏదో ఒక చర్య తీసుకోవాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై ఈ నెల 10న సుప్రీంకోర్టులో విచారణ ఉండబోతుంది. ఆలోపే స్పీకర్ కార్యాలయం నిన్న హడావుడిగా పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసింది. ఇక పదవ తేదీన సుప్రీంకోర్టు టైం లైన్ కనుక విధిస్తే పార్టీ ఫిరాయింపులపై తొందర్లోనే చర్యలు ఉంటాయని అర్థం చేసుకోవచ్చు. ఇందుకోసమే రేపు ఢిల్లీకి వెళ్తున్నారు కేటీఆర్. పార్టీ ఫిరాయింపుల కేసును చాలా సీరియస్‌గా తీసుకున్న కేసిఆర్, కేటీఆర్‌తో పాటు మరికొంతమంది లీగల్ ఎక్స్పర్ట్స్ కూడా ఢిల్లీకి పంపిస్తున్నారు. ఢిల్లీలో న్యాయవాదులతో చర్చించి.. అవసరమైతే రెండు మూడు రోజులు అక్కడే ఉండి కేసును ఫాలోఅప్ చేసుకొనున్నారు. కచ్చితంగా ఈ పది నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వస్తాయని బిఆర్ఎస్ పార్టీ పదే పదే చెబుతూ వస్తుంది. ఉప ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పార్టీ మారిన ఎమ్మెల్యే నియోజకవర్గాల్లో సమావేశాలు పట్టిమరి కేటీఆర్ చెప్పుకొస్తున్నారు. ఎప్పుడైతే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై సీరియస్ యాక్షన్ ఉండాలని పార్టీ గట్టిగా పోరాడుతుందో అప్పటినుంచి నిజానికి పార్టీ ఫిరాయింపులు కూడా తగ్గిపోయాయి. ఎమ్మెల్యేల స్థాయిలోనే కాదు కింది స్థాయిలలో కూడా పార్టీ క్యాడర్ పటిష్టంగానే ఉంది ఇప్పటికీ.. పార్టీ ఫిరాయింపుల విషయంలో ఇలాగే సీరియస్‌గా పోరాడాలని కేసీఆర్ నిర్ణయం. ఒకవేళ ఉప ఎన్నికలు వస్తే వచ్చే జనరల్ ఎలక్షన్స్ కి ఇది ప్రీ ఫైనల్‌గా ఉంటుందని గులాబీ సైన్యం ఆలోచిస్తుంది. ఉప ఎన్నికల్లో మెజారిటీ సీట్లు కచ్చితంగా సాధిస్తామని నమ్మకం పార్టీకి గట్టిగా ఉంది.

# టీచర్ల గొంతుకగా పనిచేస్తా

## డబ్బుసంచులతో వస్తున్న వారిని నిలువరిద్దాం ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి –టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి వై. అశోక్ కుమార్

నమస్తే హైదరాబాద్ : టీచర్ ఉద్యోగంలో ప్రవేశించినప్పటి నుండి రిటైర్డ్ అయ్యేంత వరకు ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పనిచేశానని, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి గా ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి గా గెలిపిస్తే టీచర్ల గొంతుకగా పనిచేస్తానని టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి వై. అశోక్ కుమార్ అన్నారు. బుధవారం గజ్వేల్ పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో విలేఖరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్ కుమార్ మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులు తమ స్వప్రయోజనాల కోసం డబ్బుసంచులతో వస్తున్నారని,వారిని నిలువరిద్దామన్నారు.ప్రభుత్వ విద్య బలోపేతానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. పేదలకు ప్రభుత్వ విద్య దూరమవుతున్న పట్టించుకునే వారే కరువయ్యారని ఆరోపించారు. ధన రాజకీయాలను ఓడించి ఉద్యమ నాయకులను ఎమ్మెల్సీ లు గా ఎన్నుకున్నట్లయితే ప్రభుత్వ విద్య బలోపేతం అవుతుందని అన్నారు. గత 36 సంవత్సరాలుగా నేను పూర్తిగా ఉపాద్యాయ ఉద్యమంతో పాటు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారిగా మీ ముందుకు వస్తున్నానన్నారు. ఉపాద్యాయ సంక్షేమం, ప్రభుత్వ విద్యా రంగ పటిష్టతకు కృషి చేస్తూ విద్యా వ్యవస్థ పటిష్ఠతకు కృషి




చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో టీపీటిఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి.తిరుపతిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రాజయ్య,జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్, జిల్లా ఉపాధ్యక్షులు పాపి రెడ్డి, టిఎస్ యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు సత్యనారాయణ,జిల్లా అధ్యక్షులు వలి అహ్మద్,జిల్లా కార్యదర్శి రాంచంద్రం, సీనియర్ నాయకులు రాంచంద్రం, రాజులు, జోన్ కన్వీనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బస్సులో జన్మించిన ఆ పాపకు బంపర్ ఆఫర్.

విధి నిర్వహణలో మానవత్వం చాటుకున్న తమ సిబ్బందిని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్ఆర్టీసీ) యాజమాన్యం ఘనంగా సన్మానించింది. హైదరాబాద్ బస్ భవన్‌లో బుధవారం ఉన్నతాధికారులతో కలిసి మణుగూరు డిపో %ూఎదీ% డ్రైవర్ కోటేశ్వరరావు గద్వాల్ డిపో కండక్టర్ కిషోర్ కుమార్, డ్రైవర్ నరేందర్ గౌడ్, జగిత్యాల డిపో మేనేజర్ సునీతలను టీజీఎస్ఆర్టీసీ సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ సత్కరించారు. ఈ సందర్భంగా విధుల్లో మానవత్వం చాటిన ఆర్టీసీ సిబ్బందికి సన్మానించారు..డ్రైవర్ చాకచక్యం.. 10 తులాల బంగారు అభరణాలు అప్పగింతమణుగూరు డిపోకు చెందిన బస్సులో గత ఏడాది డిసెంబర్ 21న ప్రయాణికురాలి 10 తులాల బంగారు అభరణాలు అపహరణకు గురయ్యాయి. ఈ విషయాన్ని ఆమె విలపిస్తూ పీహెచ్‌బీ డ్రైవర్ కోటేశ్వరరావుకు చెప్పారు. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్.. బస్సును భద్రాచలం బస్ స్టేషన్ లో ఆపి స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. బస్సులోని ప్రయాణికులందరినీ తనిఖీ చేశారు. ఆ సమయంలో ఒక ప్రయాణికురాలు వేగంగా వెళ్తున్న విషయాన్ని డ్రైవర్ గమనించి.. ఆమెను అనుసరించారు. బంగారు అభరణాలున్న బ్యాగ్ వేరే ప్రాంతంలో పెడుతుండగా గుర్తించారు. అభరణాలను అపహరించిన మహిళను పోలీసులకు అప్పగించారు. పోలీసుల సహకారంతో 10 తులాల బంగారు ఆభరణాలను ప్రయాణికురాలికి ఇప్పించారు.బస్సులో ప్రసవం.. ఆర్టీసీ సిబ్బంది ఉదారతగద్వాల డిపోనకు చెందిన బస్సులో జనవరి 2న రాయచూర్ నుండి గద్వాలకు ప్రయాణిస్తుండగా ఒక గర్భిణికి ఒక్కసారిగా పురిటినొప్పులు వచ్చాయి. ఈ విషయాన్ని గమనించిన కండక్టర్ కిషోర్ కుమార్.. డ్రైవర్ నరేందర్ గౌడ్ కు సమాచారం ఇచ్చారు. వెంటనే బస్సును పక్కకు ఆపి.. వారు 108 కి సమాచారం ఇచ్చారు. అంతలోనే పురిటినొప్పులు ఎక్కువ కావడంతో తోటి ప్రయాణికురాళ్లను సహకరించాలని కోరారు. వారు పురుడుపోయడంతో ఆ మహిళ పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది.. అనంతరం తల్లి బిడ్డను ఆస్పత్రిలో చేర్పించారు.ప్రయాణికురాలికి గుండెపోటు.. డీఎం సీపీఆర్జగిత్యాల బస్ స్టేషన్ లో జనవరి 12న ఒక ప్రయాణికురాలికి గుండెపోటు వచ్చింది. సంక్రాంతి ఆపరేషన్స్ లో భాగంగా అక్కడే విధులు నిర్వహిస్తోన్న జగిత్యాల డీఎం సునీత.. వెంటనే అప్రమత్తమయ్యారు. సత్వరమే స్పందించి ఆమెకు సీపీఆర్ చేశారు. అనంతరం 108 సాయంతో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. డీఎం సకాలంలో సత్వరమే స్పందించడంతో ప్రయాణికురాలికి ప్రాణాప్రాయం తప్పింది. సమయస్ఫూర్తితో వ్యవహరించి ఉదారతను చాటుకున్న సిబ్బందిని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ అభినందించారు. ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చుతూనే.. సామాజిక బాధ్యతగా సేవాస్ఫూర్తిని ఆర్టీసీ ఉద్యోగులు చాటుతుండటం గొప్ప విషయమని కొనియాడారు.ఆర్టీసీ బస్సులు, బస్ స్టేషన్ లలో పుట్టిన పిల్లలకు జీవిత కాలపు ఉచిత బస్ పాస్‌ను ఇవ్వాలని గతంలో యాజమాన్యం తీసుకున్న నిర్ణయం మేరకు.. గద్వాల డిపో బస్సులో జన్మించిన ఆడపిల్లకు లైఫ్ టైం ఫ్రీ బస్ పాస్ ను యాజమాన్యం మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీవోవో డాక్టర్ రవిందర్, ఈడీలు మునిశేఖర్, ఖుస్రోషా ఖాన్, రాజశేఖర్, ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప లతో పాటు హెచ్ఓడీలు విజయభాస్కర్, వెంకన్న, శ్రీదేవి, ఉషాదేవి, తదితరులు పాల్గొన్నారు.

Printed published and owned by Godishala Somaiah published from # 15-76,Medipally, Ghatkesar,Ranga reddy,Dist,Printed at Sri SehaSai Printers,IDA BalaNagar, Hyderabad,Editor : Godishala Somaiah,email:nhnews24@gmail.com,ph 9912580066,RNI APTEL/2012/45237..

NH paper 06-02-25 (4).pmd 4 2/6/2025, 7:54 AM